అన్నదాతకు నష్టకాలం

- కూరగాయలకు గిట్టుబాటు ధరల్లేక నష్టాలు
- మరోవక్క నీటి ఎద్దడితో ఎండుతున్న పంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు



లోవకొత్తూరులో ఎండిపోయిన టమాటా పంట

తుని రూరల్: ఆరుగాలం శ్రమించి పండించిన కూరగాయలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరో పక్క ఆరుతడిగా సాగు చేస్తున్న పంటలు నీటి ఎద్దడితో ఎండిపోతున్నాయి. ఎటుచూసినా నష్టాలు, కష్టాలే మిగులుతున్నాయని రైతులు వాపోతున్నారు. జనవరి వరకూ ఆకాశాన్ని అంటిన కూరగాయల ధరలు ఇప్పుడు పాతాళానికి పడిపోయాయి. కూరగాయల సాగుకు పెట్టిన పెట్టుబడులు, కోత కూలి డబ్బులు కూడా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క దళారులు ఎగుమతులు చేస్తూ, వ్యాపారులు చిల్లరగా విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు. దీంతో కూరగాయలు పండించే రైతులు అప్పులకు వడ్డీలు, వినియోగదారులు భారాలు భరించాల్సి వస్తుంది.

సబ్‌డివిజన్ పరిధిలో..

ఉద్యానశాఖ సబ్‌డివిజన్ పరిధిలో తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాలు ఉన్నాయి. సాగునీటి వసతులు లేకపోవడంతో తుని, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో రబీలో ఆరుతడి పంటలుగా రైతులు కూరగాయలు, ఆకు కూరలు పండిస్తున్నారు. ప్రధానంగా టమాటా, కాలీఫ్లవర్, క్యాబేజీ, వంగ, బెండ, బీర, చిక్కుడు, మునగ, అరటి తదితర పంటలను పండిస్తున్నారు. ఐదు మండలాల పరిధిలో టమాటా 110 ఎకరాలు, కాలీఫ్లవర్ 30 ఎకరాలు, క్యాబేజీ 55 ఎకరాలు, వంగ తోటలు 65 ఎకరాలు, బెండ, బీర, ఉల్లి, మిరప ఇతర కూరగాయలు 140 ఎకరాల్లో సాగు చేస్తున్నట్టు ఉద్యాన అధికారులు తెలిపారు.



వి.కొత్తూరులో నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న క్యాబేజీ, ఉల్లి పంటలు



వి.కొత్తూరులో తెగులు సోకిన కాలీఫ్లవర్

దిగజారిన గిట్టుబాటు ధరలు

ఈ ఏడాది జనవరి మొదట వారం వరకూ రైతు ధర పది కిలోలు బెండకాయలు, వంకాయలు రూ.300 నుంచి రూ.350, క్యాబేజీ రూ.200, టమాటా రూ.300 నుంచి రూ.400, చిక్కుడు కాయలు రూ.400 నుంచి రూ.500, కాలీఫ్లవర్ ఒక్కొక్కటి రూ.20, మునగ కాడలు కిలో రూ.100, కొత్తిమీర, పుదీనా కిలో రూ.100 నుంచి రూ.150 చొప్పున పలకడంతో రైతులకు గిట్టుబాటు ధర లభించింది. ఇప్పుడు పది కిలోల టమాటాలు రూ.50 నుంచి రూ.60, క్యాబేజీ, వంకాయలు రూ.70 నుంచి రూ.వంద, పచ్చిమిరప రూ.160 నుంచి రూ.180, పరిమాణం బట్టి కాలీఫ్లవర్ ఒక్కొక్కటి రూ.10 నుంచి రూ.12, మునగ కాడలు కిలో రూ.40 నుంచి రూ.45, కొత్తిమీర, పుదీనాలు కిలో రూ.15 నుంచి రూ.20లకే విక్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు, వ్యాపారులు కొనుగోలు చేయకపోతే తామే తుని రైతు బజారులో వాటాలు (పోగులు) వేసి చిల్లరిగా అమ్ముకోవలసి వస్తుందని చెబుతున్నారు.

ఎండుతున్న పంటలు

మెట్ట రైతులు రబీలో ఆరుతడిగా కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. విద్యుత్ బోరుబావుల ఆధారంగా కొంతమంది రైతులు ఒకటి, రెండు ఎకరాల్లో నాలుగైదు రకాల కూరగాయలు, ఆకు కూరలు పండిస్తున్నారు. సాగునీటి వసతులు లేని సన్న, చిన్నకారు రైతులు సైతం శీతాకాలం, వాతావరణం అనుకూలతతో అర ఎకరా, 10, 20, 30 సెంట్ల భూముల్లో కూరగాయలు పండిస్తుంటారు. ఈ సంవత్సరం శీతాకాలంలో మంచు ప్రభావం తక్కువగా ఉండడం, వేసవి ఆరంభంలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో నీటి ఎద్దడి ఎదురవుతోంది. దీంతో కూరగాయల పంటలకు సాగునీరు అందక ఎండిపోతున్నాయి.

పెట్టుబడి రావడం లేదు

రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టి ఒకటిన్నర ఎకరాల్లో టమాటా వంట వేశాను. జనవరి నుంచి ఫలసాయం వస్తోంది. గిట్టుబాటు ధరలేకపోవడంతో పెట్టిన పెట్టుబడి, కోత కూలి డబ్బులు నష్టపోతున్నాను. మరోపక్క నీటి ఎద్దడి, అధిక ఉష్ణోగ్రతలకు టమాటా పంట ఎండిపోతోంది.

– టి.రామునాయుడు, రైతు, లోవకొత్తూరు

రాయితీపై రుకార్ట్ సబ్జీ కూలర్లు

నీటి వసతులు ఉన్న రైతులే రబీలో పంటలు సాగు చేయాలి. ఆరుతడిగా పండించిన కూరగాయలకు గిట్టుబాటు ధరలేకపోతే రెండు, మూడు రోజులు నిల్వ ఉంచుకునే విద్యుత్ అవసరం లేని రుకార్ట్ సబ్జీ కూలర్లను 50 శాతం రాయితీపై అందిస్తున్నాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– జి.విజయలక్ష్మి, ఉద్యాన అధికారి, తుని

క్లుప్తంగా

అదృశ్యమైన మహిళ కుటుంబ సభ్యుల చెంతకు..

జగ్గంపేట: అదృశ్యమైన **మహిళను గుర్తించి** గురువారం కుటుంబ **సభ్యులకు అప్పగించి**నట్టు స్థానిక సీఐ వైఆర్కే **శ్రీనివాస్ తెలిపారు.** వివరాల్లోకి వెళితే.. **జగ్గంపేటకు చెందిన ఓ** వివాహిత తన పాపతో **సహా బుధవారం రాత్రి** ఇంటి నుంచి వెళ్లిపోయింది. **దీనిపై కుటుంబ** సభ్యులు గురువారం **ఉదయం 10 గంటలకు** పోలీసులకు ఫిర్యాదు **చేశారు.** కాగా నూతన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో మూడు గంటల వ్యవధిలోనే అదృశ్యమైన మహిళను ఎస్సై టి.రఘునాథరావు, సిబ్బంది కాకినాడలో డిమార్ట్ ప్రాంతంలో గుర్తించారు. పాప, మహిళను జగ్గంపేట స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కిర్లంపూడి: రాజుపాలెంలో దత్తాత్రేయస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. పండితుడు తేజోమూర్తుల జగదీష్‌స్వామి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ కర్త కుమారుడు ఇంధనరాజు, మధు దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ఆందోళన



తునిలో నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

తుని: ఎల్ఐసీలో తక్షణమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద గురువారం ఉద్యోగులు ఆందోళన చేశారు. అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు భోజన విరామ సమయంలో నిరసన చేపట్టడంతో ఆఫీసులో కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఎల్ఐసీలో రిక్రూట్‌మెంట్ చేపట్టి సంస్థను అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రభుత్వ సహకరించాలని కోరారు. బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సాయిబాబా, సత్యనారాయణ, రామసత్యనారాయణ, శోభన్‌కుమార్, శర్మ, రామకృష్ణ, విజయ్ పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రానికి పుణ్య నదీ జలాలు

సామర్లకోట: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న లింగోద్భవకాల అభిషేకాలు చేయడానికి దేశంలోని వివిధ ప్రాంతాల్లోని పుణ్యనదీ జలాలు గురువారం సాయంత్రం సామర్లకోట పంచారామ క్షేత్రానికి చేరాయి. జలాలను తీసుకొచ్చిన వేద పండితులకు ఈఓ బళ్ల నీలకంఠం పూర్ణకుంభ స్వాగతం పలికారు. గంగా, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణా, కావేరి, భీమరాధి, పుష్కరిణి, తుంగభద్ర, సింధు, ప్రణీత నదులకు చెందిన జలాలను తీసుకొచ్చినట్టు ఈఓ తెలిపారు. వీటిని భద్రపర్చి మహా శివరాత్రి రోజున స్వామివారికి వేద పండితులు అభిషేకం చేస్తారని చెప్పారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:

తహసీల్దార్	– 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	– 98493 36599
ఎంఈఓ	– 94942 10420
ఏపీఓ	– 70939 98217
ఏపీఎం	– 73373 16825
ఎస్సై	– 94409 04835
మండల వైద్యాధికారి	– 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	– 96520 65430
మండల వ్యవసాయాధికారి	– 83310 56609
ఫారెస్టు రేంజర్	– 94403 28540

కిర్లంపూడి:

తహసీల్దార్	– 98499 03886
ఎంపీడీఓ	– 91009 70617
ఎంఈఓ	– 90009 12335
ఎంఈఓ–2	– 98487 43433
ఏపీఓ	– 83744 46309
ఏపీఎం	– 96523 04151
ఎస్సై	– 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	– 77024 41029
వీరవరం వైద్యాధికారి	– 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	– 81066 28018
మండల వ్యవసాయాధికారి	– 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	– 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	– 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	– 89789 41840
హౌసింగ్ ఏఈ	– 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	– 97014 77778

కోటనందూరు:

తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ–1	89856 02864
ఎంఈఓ–2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613
ఎస్సై	94409 00773

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న విజయ్‌ప్రకాష్

తుని: సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత సంవత్సరం డిసెంబర్ 28న నిర్వహించిన సీవీ రామన్ ఒలంపియాడ్ టాలెంట్ టెస్టులో స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జనరల్ నాలెడ్జ్, గణితం, సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రం విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఎం.హంసిని, ఎం.విశ్రుత్ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో జీనియస్ అవార్డులు సాధించారు. వీరితో పాటు జిల్లా స్థాయిలో ఆర్. సాత్విక్‌చంద్ర, కె.ప్రహాసిత, డి.విఖ్యాత్, ఇ.నవీన్ హర్ష, కె.సిద్ధార్థవర్మ, పి.గౌతమ్‌కృష్ణ ప్రథమస్థానం, వై.రిషిదుర్గ, పి.శ్రీవత్స, ఎ.భువనశ్రీనివాస్‌కామేష్ ద్వితీయస్థానం సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హైదరాబాద్ లలిత కళాతోరణంలో జరిగిన కార్యక్రమంలో జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసినట్టు తెలిపారు. విజేతలను విద్యాసంస్థల అధినేత నరశింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అభినందించారు.

నేడు విద్యుత్ అంతరాయం

శంఖవరం: కత్తిపూడి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో డీఈ వీరభద్రరావు గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కత్తిపూడి, సీతంపేట, పాత కొత్తూరు, వజ్రకూటం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

గోకవరం: మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మొత్తం 25 అనుబంధ విభాగాలకు అధ్యక్షులను ప్రకటించారు. నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడిగా నకిరెడ్డి ఆదివిష్ణు చక్రవర్తి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పడాల సత్యవతి, రైతు విభాగం అధ్యక్షుడిగా పాటంశెట్టి కృష్ణమూర్తి, బీసీ సెల్ అధ్యక్షుడిగా రాపేటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బూలా అబ్బులు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా తుర్రం సత్యవతి, మైనార్టీ సెల్ సయ్యద్ షేర్ అలీషా, క్రిస్టియన్ మైనార్టీ సెల్ తురుగాటి ప్రేమ్‌విలియమ్స్, స్టూడెంట్ వింగ్ నకిరెడ్డి సుధాకర్, పంచాయతీ రాజ్ వింగ్ పోకల సుబ్బారావు, ఆర్‌టీఐ వింగ్ గడియాల అప్పారావు, వలంటీర్స్ వింగ్ వెలుచూరి శ్రీను, గ్రీవెన్స్ సెల్ తుమ్మలపల్లి సూర్యప్రభాకరరావు, వాణిజ్య విభాగం కరుటూరి వీర్రాజు, వీవర్స్‌వింగ్ చిల్లూరి రాంబాబు, వైఎస్సార్ టీయూసీ గుర్రం మహాలక్ష్మి, లీగల్ సెల్ గుల్లా ఏడుకొండలు, కల్చరల్ వింగ్ తేజోమూర్తుల జగదీశ్వరరావు, సోషల్ మీడియా వింగ్ కాపవరపు వెంకటరమణ, ఐటీ వింగ్ గెద్దం సురేంద్ర, దివ్యాంగుల విభాగం బళ్లా కామేశ్వరరావు, డాక్టర్స్ వింగ్ బచ్చు సత్యవరప్రసాద్, ఇంటలెక్చువల్ ఫోరం వేగి రామకృష్ణ, బూత్ కమిటీల విభాగం పల్లెల వెంకట అప్పలరాజు, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడిగా గోకేడ చిట్టిబాబు నియమితులయ్యారు. అనుబంధ విభాగాల నూతన అధ్యక్షులకు పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు.

విలేకరిపై దాడి అమానుషం



శంఖవరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్ క్లబ్ సభ్యులు

శంఖవరం: విధి నిర్వహణలో భాగంగా అన్యాయాన్ని ఖండిస్తూ ఓ పత్రికలో వార్త ప్రచురించిన విలేకరిపై టీడీపీ నాయకుడు దాడి చేయడం అమానుషమని శంఖవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కేలంగి హరినాథ్ అన్నారు. విలేకరిపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. ఈ మేరకు గురువారం ప్రెస్‌క్లబ్ సభ్యులు తహసీల్దార్ తాతారావుకు వినతి పత్రం అందజేశారు. మన్యం జిల్లా పార్వతీపురం మండల ప్రజాశక్తి విలేకరిపై టీడీపీ నాయకులు దాడిచేయడం దారుణమన్నారు. నిందితుడు వేణుగోపాలనాయుడును వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుండ్రా గణేష్, ఉరుకుట్ల రమణ, నెల్లిపూడి కృష్ణ, బొట్ల లోవరాజు, రేలంగి దొరబాబు, గణపతి, దాసరి శ్రీను, అపురూప్, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లేగ దూడల ప్రదర్శన



లేగ దూడల ప్రదర్శనలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: పశువుల ఆరోగ్యంపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ప్రత్తిపాడు సహాయ సంచాలకులు ఈట చిక్కం బాలచంద్ర యోగీశ్వర్ సూచించారు. మండలంలోని ధర్మవరంలో గురువారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా సంవత్సరం లోపు వయస్సు కలిగిన 40 పెయ్య దూడలను ప్రదర్శించారు. వీటిలో లింగనిర్ధారిత వీర్యం ద్వారా పుట్టిన 15 దూడలు ఉండటం విశేషం. ఈ ప్రదర్శనలో తోట సత్యనారాయణ, చిలకలపల్లి వెంకటరమణ, ఇంటిపల్లి గోపిలకు చెందిన పెయ్యి దూడలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం దూడలకు వ్యాధి నివారణ టీకాలను వేశారు. పాడి రైతులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య శస్త్రచికిత్స సహాయకురాలు డాక్టర్ ఎస్.వరలక్ష్మి, డాక్టర్ పీఎస్ఎస్ మంజూష, డాక్టర్ వీవీ కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం



బ్రాహ్మణ రేవు వద్ద జరుగుతున్న నిర్మాణ పనులు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు నది వద్ద జరుగుతున్న నిర్మాణ పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక ఏలేరు నది బ్రాహ్మణ రేవు వద్ద మున్సిపల్ నిధులతో మెట్లు, గోడ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ పనులను మున్సిపల్ అధికారులు పర్యవేక్షించడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ మహాశివరాత్రి పుణ్యస్నానాలకు ఏటా వేలాది మంది తరలివస్తారు. భక్తుల రద్దీగా ఉండే ప్రాంతంలో చేపట్టిన నిర్మాణ పనులపై అధికారుల నిత్య పర్యవేక్షణ ఉండాలి. అలాంటిది అధికారులు పనులను కనీసం కన్నెత్తి చూడడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణ పనులను పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

మహాశివరాత్రికి చురుగ్గా ఏర్పాట్లు



తొండంగిలోని రామలింగేశ్వరస్వామి ఆలయం

తొండంగి: మహాశివరాత్రి వేడుకలకు మండలంలోని శివాలయాలు ముస్తాబు అవుతున్నాయి. తొండంగి రామలింగేశ్వరస్వామి, ఒంటిమామిడిలో విశ్వేశ్వరస్వామి, పైడికొండ, ఎ.కొత్తపల్లి, అద్దరిపేట, బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం, పంపాదిపేట, గోపాలపట్నం గ్రామాల్లోని ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, బారికేడ్లు, చలువ పందిర్లు తదితర ఏర్పాటు చేస్తున్నారు. శివరాత్రికి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీలు తెలిపాయి.

గ్రామాల్లో సోషల్ ఆడిట్ ప్రారంభం



చామవరంలో సోషల్ ఆడిట్‌లో భాగంగా ఉపాధి కూలీల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఆర్‌పీ, సిబ్బంది

తుని రూరల్: మండలంలో ఆరు గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ ప్రారంభమైంది. గురువారం స్టేట్ రిసోర్స్ పర్సన్ సింహాద్రి ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లు చామవరం, ఎ.అగ్రహారం, చేపూరు, లోవకొత్తూరు, ఎస్ఎస్‌వీ నగరం, కొలిమేరు గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులను పరిశీలించి, కూలీలకు మస్తర్లు వేశారా ?, కూలి డబ్బులు అందాయా ? అనే వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ సింహాద్రి మాట్లాడుతూ ఒక్కొక్క గ్రామంలో మూడు నుంచి నాలుగు రోజులు సోషల్ ఆడిట్ జరుగుతుందని చెప్పారు. శుక్రవారం నుంచి హంసవరం, హెచ్.కొత్తూరులో సోషల్ ఆడిట్ ప్రారంభమవుతుందన్నారు. మొత్తంగా మార్చి మూడో తేదీ వరకూ గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆ తర్వాత మండల స్థాయిలో బహిరంగంగా నివేదిక వెల్లడిస్తామని తెలిపారు.

రాజ్యాంగం ద్వారానే సామాజిక న్యాయం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మెహర్

తొండంగి: భారత రాజ్యాంగం ద్వారానే దేశంలోని అన్నివర్గాలకూ సామాజిక న్యాయం సాధ్యమని కాకినాడ నెహ్రూ యువజన కేంద్రం ప్రతినిధి ఎస్.ఆనంద్‌నెహ్రూ, పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీకే మెహర్ అన్నారు. అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత అంబేడ్కర్, మహాత్మా గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అన్ని సామాజిక వర్గాలకూ న్యాయం జరిగేలా భారత రాజ్యాంగాన్ని అంబేడ్కర్, ఇతర మహనీయులు రూపొందించారన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై యువత అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.దివాకర్, కె.బాలసిద్ధార్థబాబు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి సంరక్షణపై అవగాహన

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కంటి సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు కిరణ్ ఐ కేర్ ఆసుపత్రి డాక్టర్ వి.విజయ్ కుమార్ అవగాహన కల్పించారు. కళాశాలలో మూడు రోజుల పాటు ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులకు కంటి పరీక్షలు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డి.చెన్నారావు తెలిపారు. కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపైనే మురుగు



ఏలేశ్వరంలో ప్రధాన రహదారిపై మురుగునీరు

ఏలేశ్వరం: పట్టణంలోని మార్కెట్ సమీపంలో ప్రధాన రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సంతరోజు కావడంతో మార్కెట్‌కు వచ్చేవారు అసౌకర్యానికి గురయ్యారు. మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో పాటు నిల్వ ఉండటంతో అంటు రోగాలు వచ్చే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి మురుగునీరు పోయే మార్గం చూపాలని ప్రజలు కోరుతున్నారు.


సైన్స్ ల్యాబ్ శిథిలం



కిర్లంపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సైన్స్ ల్యాబ్ శిథిలావస్థకు చేరింది. 45 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో శ్లాబ్, గోడ బీటలు వారి కూలేందుకు సిద్ధంగా ఉంది. వర్షాకాలంలో శ్లాబ్ నుంచి వర్షం నీరు లీకవ్వడంతో సైన్స్ ల్యాబ్‌లోని పరికరాలు, పుస్తకాలు, విలువైన ప్రాక్టికల్ సామగ్రి తడిసిపోతున్నాయి. చెదలు చేరి కిటికీలు, ద్వారాలు విరిగిపోయే దశలో ఉన్నాయి. శ్లాబ్ పెచ్చులూడి పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని లెక్చరర్లు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన భవనం రెగ్యులర్ క్లాసులకు సరిపోవడంతో పాత భవనంలోనే సైన్స్ ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. శిథిలమైన భవనాన్ని తొలగించి దానిస్థానంలో నూతన భవనం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న బిల్డింగ్‌లోనే ప్రాక్టికల్స్‌కు హాజరైన విద్యార్థులు



శ్లాబ్ పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న భవనం